మోతాదు మించితే అనర్థమే

రసాయనిక ఎరువులు, పురుగు మందులు మోతాదుకు మించి వినియోగిస్తే పంటలకు నష్టం కలుగుతుందని మండల వ్యవసాయ అధికారి దీప తెలిపారు. భూసార పరీక్షలు చేసుకుని అందుకు అనుగుణంగా ఎరువులు వేయాలని సూచిస్తున్నారు. అధికారులు సూచనలు పాటిస్తూ సేంద్రియ ఎరువులు వినియోగించి పంటలు సాగు చేసుకోవడం ద్వారా దిగుబడితోపాటు లాభాలు పొందవచ్చని పేర్కొంటున్నారు. –వాకాడు



వరిపంటపై రసాయనిక మందు పిచికారీ చేస్తున్న రైతు అంకయ్య

- అధిక రసాయనిక ఎరువుల వాడకం పంటలకు నష్టం
- భూసార పరీక్షలకనుగుణంగా వాడాలంటున్న అధికారులు

గూడూరు నియోజకవర్గంలో గూడూరు, కోట, చిల్లకూరు, వాకాడు, చిట్టమూరు మండలాల్లో 3145 మంది రైతులు ఉన్నారు. ఇక్కడ సాధారణ సాగు విస్తీర్ణం 41 వేల ఎకరాలు ఉంది. ఈ ఏడాది ఎడగారు 8.5 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం పంట పొట్ట, వెన్ను దశలో ఉంది. రైతులు ప్రధానంగా 20.20.03, డీఏపీ, 17.17.17 ఎరువులు వాడుతున్నారు. సాధారణంగా ఎకరా సాగులో 75 నుంచి 100 కిలోల రసాయనిక ఎరువులు, 500 గ్రాముల నుంచి 750 గ్రాముల వరకు పురుగు మందులను రైతులు వినియోగిస్తారు. అధిక దిగుబడులు, గింజ బరువు, గింజ నిగారింపు నాణ్యత పెరిగేందుకని రైతులు పోటీపడి ఎకరా వరికి 350 నుంచి 450 కిలోల వరకు రసాయనిక ఎరువులు, 1,250 గ్రాముల నుంచి 2 లీటర్ల వరకు పురుగు మందులను పంటలపై వెదజల్లుతున్నారు. ఇలా ఒక్క ఎడగారు సీజన్‌లో మూడు మండలాల్లోని రైతులు దాదాపు 3.5 వేల టన్నుల రసాయనిక ఎరువులు, 20 వేల లీటర్ల పురుగు మందులు పంటలపై పిచికారీ చేశారు. దీంతో భూసారం దెబ్బతిని, పంట దిగుబడులు భారీగా తగ్గుతున్నాయి.



ఎరువులు కలుపుతున్న రైతులు

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఆధారంగా రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. మార్కెట్లోకి వచ్చే కొత్త కొత్త రకాల ఎరువులు, పురుగు మందులను అధికారుల సలహా తీసుకోకుండానే రైతులు ఇష్టానుసారం వాడుతున్నారు. దీనివల్ల పంట దిగుబడులు తగ్గి నష్టాలపాలవుతున్నారు. ఈ క్రమంలోనే సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరగడంతోపాటు దీర్ఘకాలికంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

భూ సారం దెబ్బతింటుంది



అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వినియోగించడం వలన భూ సారం దెబ్బతింటుంది. పంట దిగుబడి కూడా తగ్గుతుంది. అధిక రసాయనిక ఎరువుల వాడకంతో వచ్చే అనర్థాలపై రైతులకు అవగాహన లేకపోవడంతో పోటీపడి ఎరువులు వేస్తున్నారు. ఈ సారి పంటలపై ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో పురుగు మందులు అధికంగా వాడాల్సి వచ్చింది.
–కోట్లపూడి శ్రీనివాసులు, రైతు వాకాడు.

భూసార పరీక్షల ఆధారంగానే ఎరువుల వినియోగం



అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడకం మంచిది కాదు. వ్యవసాయ కేంద్రంలో నిర్వహించిన భూసార పరీక్షల ఆధారంగా తగిన మందులను మాత్రమే వాడాలి. లేదంటే భూసారం క్రమంగా దెబ్బతిని పంట దిగుబడులు తగ్గుతాయి. పంట పంటకు మధ్యలో పచ్చిరొట్ట విత్తనాలు చల్లాలి. పంటల సాగులో అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చు.
–దీప, ఏవో వాకాడు

క్లుప్తంగా

సీఐ విజయకృష్ణ బాధ్యతల స్వీకరణ

రాపూరు: రాపూరు సీఐగా విజయకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఒంగోలు సీసీఎస్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సుబ్రమణ్యం గుంటూరుకు బదిలీ అయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు.

రెవెన్యూ కార్యాలయం పరిశీలన

ఓజిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని పరిశీలించారు. కార్యాలయ భవనం పైకప్పు గురువారం రాత్రి పెచ్చులూడి పడిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీవో శుక్రవారం ఓజిలి చేరుకుని పెచ్చులూడిన గదిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలకు గది పైకప్పు దెబ్బతినిందని తెలిపారు. రికార్డులు సక్రమంగా ఉన్నాయన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన భవనం మంజూరుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. డీటీ మధుసూదన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఓజిలి: దోమల కాటుతో మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతాయని, జాగ్రత్తగా ఉండాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి చిన్నయ్య తెలిపారు. మండలంలోని కారూరులో శుక్రవారం డ్రైడే సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి మలాథిన్ స్ప్రేచేయించాలన్నారు. అలాగే తల్లిపాల వారోత్సవాలు, ఎల్‌సీడీసీ సర్వేపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజగోపాల్, ప్రసాద్, కుసుమకుమారి, గీతా, వేణుగోపాల్, సుప్రజ పాల్గొన్నారు.

శాకాంబరిగా రాపూరమ్మ



రాపూరు: రాపూరు గ్రామ దేవత రాపూరమ్మ శుక్రవారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆషాడ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా శాకాంబరిదేవిగా అలంకరించినట్లు తెలిపారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కమనీయం వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

వాకాడు: మండలంలోని వెంకటరెడ్డిపాళెంలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి స్వామి వారిని ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన గురువులు తత్వ విచారణ, పాద పూజలు చేశారు.

పోటాపోటీగా క్రికెట్ పోటీలు

వెంకటగిరి రూరల్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటగిరిలోని తారకరామా మైదానంలో సీనియర్ విభాగం క్రికెట్ పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. కడప–చిత్తూరు జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేపట్టిన చిత్తూరు జట్టు 52.03 ఓవర్లకు 257 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 51 ఓవర్లకు 192 పరుగులుచేసి 6 వికెట్లు కోల్పోయింది. 77 పరుగులు తేడాతో కడప జట్టు ఆధిక్యంలోఉంది.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

వెంకటగిరి రూరల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యాలను ఏర్పరుచుకుని శ్రమించాలన్నారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రవీంద్రబాబు, ఎస్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు జానకిరామ్, శేషు, టీడీపీ నేత పులుకొల్లు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- కక్ష సాధింపు చర్యలు తగదు
- హామీలు నెరవేర్చండి
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: రాష్ట్రంలో అరాచక పరిపాలన కొనసాగుతోందని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆయన శుక్రవారం వాకాడులోని తన నివాసంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు దిగుతోందన్నారు. ఇందులో భాగంగానే ఎన్నికలు ముగిసిన 40 రోజుల తర్వాత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చి అరెస్టు చేశారని విమర్శించారు. అధికారం చేపట్టిన తొలి మాసంలోనే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం లెక్కలేనన్ని అరాచకాలు చేసిందని దుయ్యబట్టారు. అప్పుడే ప్రజలు ఛీకొడుతున్నారని తెలిపారు. తల్లికి వందనం కింద నగదును డిసెంబర్ లోపు జమచేయాలని డిమాండ్ చేశారు. ఇసుక, గ్రావెల్, మైనింగ్ దోపిడీని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రజలకు మేలు జరిగే వరకు తమ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, దువ్వూరు మధురెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు, మధుయాదవ్, రాజారెడ్డి, పలగాటి సనత్‌రెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వాకాటి రవి, నెల్లూరు నెంచలరెడ్డి, డి భార్గవ్‌రామ, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక విధానంతో భవన నిర్మాణ కార్మికులకు ఇక్కట్లు

గూడూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విధానాలతో ఇసుక దొరకడం లేదని, దీంతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ నాయకులు తెలిపారు. వారు శుక్రవారం గూడూరులోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో విలేకరులతో మాట్లాడారు. ఉచితంగా ఇసుక ఇస్తామని ప్రకటించిన టీడీపీ కూటమి ప్రభుత్వం నేడు దూర ప్రాంతాల్లో డంపింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్ ఇసుక గూడూరు పట్టణంలోకి రావడానికి రూ.6 వేలు అవుతోందని తెలిపారు. భవన నిర్మాణ పనులు ఆగిపోవడంతో కార్మికుల ఉపాధి దెబ్బతినిందని వాపోయారు. దీన్ని నిరసిస్తూ సోమవారం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసనతోపాటు భారీ ర్యాలీ చేపట్టనున్నట్టు వివరించారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. సంఘం వ్యవస్థాపకులు పుట్టా శంకరయ్య, అధ్యక్షుడు ఎస్కే రఫీ, సీఐటీయూ నాయకులు జోగి శివకుమార్, గండికోట మధు, అడపాల ప్రసాద్, బీవీ రమణయ్య, పి.సాయి పాల్గొన్నారు.

మనిషి జీవన శైలిలో మార్పుల వల్లే క్యాన్సర్

గూడూరు రూరల్: మనిషి జీవన శైలిలో మార్పులు రావడంతోనే క్యాన్సర్ బారిన పడుతున్నారని రెడ్ క్రాస్ సొసైటీలో ఆధ్వర్యంలోని క్యాన్సర్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీ తెలిపారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఉన్న సునీత సేవా సంస్థ కార్యాలయంలో శుక్రవారం మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్యాన్సర్ కౌన్సిలర్ కన్యాకుమారి, సునీత సేవా సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సులక్ష్మీ, ఉమాదేవి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు క్యాన్సర్ పరీక్షలు చేసుకోవాలి

నాయుడుపేట టౌన్: మండలంలోని విన్నమాల, శ్రీనివాసపురంలో శుక్రవారం తిరుపతి స్విమ్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన పింక్ బస్సులో మహిళలకు నోరు, రొమ్ము, గర్భకోశానికి సంబంధించి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. 64 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శంకరయ్య, డాక్టర్ వికాస్ మాట్లాడుతూ 35 ఏళ్లు దాటిన మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నయం చేయవచ్చని వివరించారు. ఈనెల 5 తేదీన అన్నమేడు, కూచివాడ గ్రామాలు, 6న కల్లిపేడు, కాపులూరు, 8న భీమవరం, మేనకూరు, 9న పూడేరు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ప్రభుత్వ వైద్యులు శంకరయ్య వెల్లడించారు. కార్యక్రమంలో స్విమ్స్ వైద్యులు శ్రావంతి, పీఆర్వో చంద్రమోహన్, టెక్నీషియన్ రెడ్డి ప్రసూన, గొట్టిపల్లి పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



మాట్లాడుతున్న గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్

గూడూరు రూరల్: లింగ నిర్ధారణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ ఆదేశించారు. ఆయన శుక్రవారం జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొంతమంది చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తూ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ చేస్తున్నారనే సమాచారం అందితే వెంటనే 102, 104 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో మస్తానమ్మ, డివిజనల్ పరిపాలనాధికారి శిరీష, వైద్యులు గిరిజ, సీడీపీవో మహబూబీ, రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



గిరిజనులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం

దక్కిలి: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని వెంకటేశ్వరపురం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం దూడల పెంచలయ్య తెలిపారు. మండలంలోని వెంకటేశ్వరపురం గిరిజన కాలనీలో శుక్రవారం ఐదుగురు బడి ఈడు పిల్లలను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడారు. వారిని పాఠశాలలో చేర్పించాలని కోరారు. తమ పిల్లలకు ఆధార్ కార్డులు లేకపోవడం వల్ల పాఠశాలలో చేర్చలేదని తల్లిదండ్రులు తెలిపారు. ఈ విషయాన్ని హెచ్‌ఎం పెంచలయ్య ఎంపీడీవో లీలా మాధవి, ఎంఈవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు పి.తేజోవర్మ తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నియంత్రణకు కృషి చేద్దాం

దక్కిలి/వెంకటగిరి రూరల్: దక్కిలి మండలంలో కుష్టు, క్షయవ్యాధి నియంత్రణకు కృషి చేద్దామని జిల్లా కుష్టు, క్షయ వ్యాధి నివారణాధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం దక్కిలి పీహెచ్‌సీతోపాటు వెంకటగిరి అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యాధికారులతో కలిసి కుష్టు, క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రెండేళ్లుగా కుష్టు, క్షయవ్యాధిగ్రస్తులు లేకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. గ్రామాల్లో జూలై 18 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు ఏఎన్‌ఎంల ద్వారా పలువురికి పరీక్షలు నిర్వహించామన్నారు. గ్రామాల్లో ఏఎన్‌ఎంలు గుర్తించిన 15 మందికి మరోసారి పరీక్షలు చేశామన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న ఒకరికి మందులు పంపిణీ చేసి సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో డీపీఎంవో రాజేంద్ర ప్రసాద్, వైద్యాధికారులు బిందు ప్రియాంక, శ్రీహరి, కలయి సెల్వం, హెల్త్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మీ, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, వెంకటగిరిలో వైద్యులు రాజేష్, రాజారమణి, కిరణ్, ప్రసాద్‌రావు, ల్యాబ్ టెక్నీషియన్ ఫయాజ్ పాల్గొన్నారు.

హోమ్ గార్డులు పోలీసు శాఖలో భాగమే



హోమ్ గార్డు కమాండెంట్‌ను సత్కరిస్తున్న హోమ్‌గార్డులు

గూడూరు రూరల్: హోమ్ గార్డులు కూడా పోలీసు శాఖలో భాగమేనని, ప్రజలకు సేవలు అందించడంలో పోటీ పడాలని హోమ్ గార్డు కమాండెంట్ మహేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం గూడూరు, నాయుడుపేట డివిజన్లకు చెందిన హోమ్‌గార్డుల దర్బార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు డివిజన్లలో పనిచేసే హోమ్ గార్డులు ఉత్తమ సేవలు అందించి జిల్లాలో మంచి పేరు తీసుకురావాలన్నారు. హోమ్ గార్డుల సమస్యలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎస్పీ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పుపై ఎమ్మార్పీఎస్ సంబరాలు

దొరవారిసత్రం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంపై ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ ప్రజలు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలు పంచుకుని ఆనందాన్ని వ్యక్తం చేశారు. బూదూరులో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షు డు నాగేశ్వరరావు, నాయకులు గోవర్ధన్, నారాయణ, రవి, మురళి, మార్క్ పాల్గొన్నారు.

మాదిగల కల నెరవేరింది

ఓజిలి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం ద్వారా మాదిగల కల నెరవేరిందని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకుడు తోళ్ల నారాయణ తెలిపారు. ఓజిలి బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో 35 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నట్టు గుర్తుచేశారు. వర్గీకరణలో మాదిగలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వెంకటరమణయ్య, చెంచుకృష్ణయ్య, వెంకటేశ్వర్లు, చెంగయ్య, తిరుపాలయ్య, రాగయ్య, వెంకయ్య, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో మంచి లాభాలు

పెళ్లకూరు: ఆయిల్‌పామ్ సాగుతో మంచి లాభాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారి శారద తెలిపారు. ఆమె శుక్రవారం కానూరులోని రైతు సేవా కేంద్రంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేపట్టే రైతులు హెక్టారుకు 150 మొక్కలు నాటుకోవాలన్నారు. ఐదో ఏడాది నుంచి హెక్టారుకు 5 నుంచి 10 టన్నులు దిగుబడి వస్తుందన్నారు. తద్వారా సుమారు రూ.1.30 లక్షల ఆదాయం సమకూరుతుందని వివరించారు. రైతులు ఉద్యానశాఖ ద్వారా హెక్టారుకు జీనస్ రకాలకు రూ.20 వేలు, ఇంపోటెడ్ రకాలకు రూ.29 వేలు, అంతరపంట సాగుకు రూ.5,250, నిర్వహణకు రూ.5250 రాయితీ పొందవచ్చని చెప్పారు. చవుడు లేని ఎర్ర, నల్లగరప నేలలు, మురుగునీరు వెళ్లే సౌకర్యం ఉన్న నేలలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలమని తెలిపారు. త్రీఎఫ్ కంపెనీ మొక్కలు సరఫరా చేయడంతో పాటు దిగుబడులను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న పీపీ, అధికారులు

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సూళ్లూరుపేట కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజీ ప్రకృతికుమార్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఫారెస్టు అధికారులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి చెట్లను, అడవులను కపాడుకుంటేనే భావితరాలకు మంచి వాతావరణం అందుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామయ్య, పోలీస్, ఫారెస్టు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి సబ్సిడీ

దొరవారిసత్రం/సూళ్లూరుపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా పండ్ల తోటలు, కూరగాయల సాగుకు సబ్సిడీ ఇస్తోందని ఉద్యాన శాఖ అధికారిణి యామిని శుక్రవారం తెలిపారు. హెక్టారుకు మామిడికి రూ.7,950, జామకు రూ.17,599, డ్రాగన్ ఫ్రూట్, అంజీర్ సాగుకు రూ.30 వేలు సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. హైబ్రిడ్ కూరగాయల పథకం కింద హెక్టార్‌కు రూ.20 వేలు, పూల తోటలకు రూ.16 వేలు, మల్చింగ్ షీట్‌కి రూ.16 వేలు వస్తాయని వివరించారు. ఆయిల్ పామ్ మొక్కలను ఉచితంగా ఇస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ వేసిన రైతులకు నాలుగేళ్ల పాటు పంటకు, ఎరువులకు కలిపి రూ.42 వేలు సబ్సిడీ అందుతుందని తెలిపారు. సమాచారం కోసం 7995086941లో సంప్రదించాలని సూచించారు.

పంట నమోదు తప్పనిసరి

సూళ్లూరుపేట రూరల్: రైతులు తమ పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూళ్లూరుపేట వ్యవసాయ ఏడీఏ అనిత తెలిపారు. ఆమె శుక్రవారం ఇలుపూరు, మంగానెల్లూరులో పంట నమోదుపై గ్రామ సభలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంట నమోదు చేసుకుంటే ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతే పరిహారం పొందవచ్చన్నారు. రైతులు ఆర్బీకేల్లో ఉన్న గ్రామ సహాయలకు వద్ద ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కవిత, వ్యవసాయ సహాయకులు గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

గూడూరు రూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంఈవో కాంచన తెలిపారు. ఇటీవల అన్నం సరిగ్గా ఉడకలేదన్న ఫిర్యాదులు అందడంతో ఆమె శుక్రవారం చవటపాళెం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం అక్షయ ప్రాత నిర్వాహకులతో మాట్లాడారు. పాఠశాల ఆవరణలోకి భారీ వాహనాలు వస్తున్నందున ప్రహరీ గోడ నిర్మించాలని విద్యార్థులు కోరారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆమె తెలిపారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

బాలాయపల్లి (సైదాపురం): మండలంలోని బాలాయపల్లితోపాటు పలు గ్రామాల్లో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టిసారించినట్టు ఎస్ఐ మహబూబ్ సుభాని తెలిపారు. ఆయన శుక్రవారం జయంపు గ్రామంలో ట్రాఫిక్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నిబంధలు పాటించాలన్నారు. దుకాణాల ముందు, రోడ్డులో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలపరాదని సూచించారు.

తల్లిపాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం

కోట: తల్లిపాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి తెలిపారు. మండలంలోని గూడలి దక్షిణపాలెం, విద్యానగర్ ప్రకాశం కాలనీలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాల ద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.





రాపూరు: గోనుపల్లిలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, పెళ్లకూరు: దిగువచావలిలో..

ముర్రుపాలే బిడ్డకు తొలి టీకా

రాపూరు: పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తొలి టీకాలా పనిచేస్తాయని అంగనవాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గోనుపల్లిలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: చిన్నారులకు తల్లిపాలతో మంచి ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మీ తెలిపారు. మండలంలోని దిగువచావలిలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలన్నారు. తద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. సీహెచ్‌వో రజిత, అంగన్‌వాడీ వర్కర్ రాజేశ్వరి, ఏఎన్ఎం పొన్నెమ్మ, ఆశా వర్కర్ నాగమ్మ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ఓజిలి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో కె.ఉమామహేశ్వరి తెలిపారు. ఆర్మేనిపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ సుజన, వైద్యాధికారి మాధవ్, కార్యకర్తలు విజయమ్మ, కవిత, గౌరి, జి.సుబ్బరత్నమ్మ, ఎం.సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శివజ్యోతి, రేణుక తెలిపారు. వారు శుక్రవారం తిక్కవరం, కాకువారిపాళెం గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

బిడ్డకు తల్లిపాలు తప్పనిసరి

గూడూరు రూరల్: పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు తాగించాలని ఐసీడీఎస్ సీడీపీవో మహబూబీ తెలిపారు. గూడూరు రూరల్ పరిధిలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ స్వరూపారాణి, చెన్నూరు పీహెచ్‌సీ వైద్యులు లీలాక్రిష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ మస్తానయ్య పాల్గొన్నారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహిత తెలిపారు. మండలంలోని అమ్మపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డకు 6 నెలలు వచ్చే వరకు తప్పనిసరిగా పాలు పట్టాలన్నారు. బాల్య వివాహాలు నేరమని, బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఎస్కే దివ్యతేజ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



చిల్లకూరు: కాకువారిపాళెంలో ర్యాలీ



గూడూరురూరల్: మాట్లాడుతున్న సీడీపీవో మహబూబీ